మూడేళ్ల విద్యుత్ ప్రణాళికలు సిద్ధం చేయండి

- ఫ్యూచర్ సిటీలో భూగర్భ విద్యుత్‌లైన్లు
- ఒఆర్ఆర్ చుట్టూ సోలార్ విద్యుత్‌కు ప్రణాళికలు
- విద్యుత్ సమీక్షా సమావేశంలో సిఎం రేవంత్‌రెడ్డి


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సిఎం రేవంత్

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో
రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా వచ్చే మూడేళ్ల కాలానికి సంబంధించి పూర్తిస్థాయి ప్రణాళికల్ని సిద్ధం చేసుకోవాలని ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని సిఎం నివాసంలో విద్యుత్‌శాఖపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. డిప్యూటీ సిఎం, ఆర్థిక, విద్యుత్ శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఇంధనశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, సిఎంఒ ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, ట్రాన్స్‌కో సిఎండి కృష్ణభాస్కర్, టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి ముషారఫ్ అలీ, టిజి రెడ్కో ఎండి వి అనీల తదితరులు పాల్గొన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు (ఒఆర్ఆర్) నుంచి రీజనల్ రింగ్ రోడ్డు (ట్రిబుల్ ఆర్) వరకు రేడియల్ రోడ్లు, శాటిలైట్ టౌన్‌షిప్‌లకు కావాల్సిన విద్యుత్ అవసరాల కోసం హెచ్ఎండిఎతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సబ్‌స్టేషన్లను అప్‌గ్రేడ్ చేసుకోవాలని, లైన్ల ఆధునీకరణపై దృష్టి పెట్టాలని చెప్పారు. ఫ్యూచర్‌సిటీలో పూర్తిగా భూగర్భ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అక్కడ ఎలాంటి విద్యుత్ టవర్లు, పోల్స్, లైన్లు బహిరంగంగా కనిపించడానికి వీల్లేదని స్పష్టం చేశారు. అక్కడి హై టెన్షన్ లైన్లను కూడా తరలించాల్సి ఉంటుందని గుర్తుచేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో స్మార్ట్ పోల్స్ ఏర్పాట్లను ప్రయోగాత్మకంగా సెక్రటేరియట్, నెక్లెస్ రోడ్, కేబీఆర్ పార్కు వంటి ప్రాంతాల్లో చేపట్టాలని చెప్పారు. 160 కిలో మీటర్ల అవుటర్ రింగ్ రోడ్ పొడవునా సోలార్ విద్యుత్ వినియోగించుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలనీ, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) పరిధిలోని ఫుట్‌పాత్‌లు, నాలాల్లో సోలార్ విద్యుదుత్పత్తికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. రాష్ట్రంలోకి నూతన పరిశ్రమలతో పాటు గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, డేటా సెంటర్లు, మాస్ ట్రాన్స్‌పోర్టేషన్ (మెట్రో, ఎలక్ట్రికల్ వెహికిల్స్) వంటివి పెద్ద సంఖ్యలో వస్తున్నందున పునరుత్పాదక ఇంధనంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. దానికోసం రోడ్‌మ్యాప్ సిద్ధం చేసుకోవాలన్నారు. గతేడాదితో పోలిస్తే ఇప్పుడు విద్యుత్ డిమాండ్ 9.8 శాతం పెరిగిందనీ, అయినా నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరాను చేయగలుగుతున్నామని తెలిపారు. ఈ ఏడాది అత్యధికంగా 17,162 మెగావాట్ల పీక్ డిమాండ్ నమోదైందనీ, 2025-26లో 18,138 మెగావాట్లు, 2034-35 నాటికి 31,808 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదవుతుందనే అంచనా ఉన్నందున దానికి తగినట్టు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. క్లీన్ ఎనర్జీ, పంప్డ్ స్టోరేజ్, ఫ్లోటింగ్ సోలార్ విద్యుదుత్పత్తి అవకాశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం కొత్తగా అమల్లోకి తెచ్చిన క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీని అమల్లోకి తేవాలనీ, దానికోసం విద్యుదుత్పత్తిలో ప్రఖ్యాతిగాంచిన ప్రపంచ దిగ్గజ సంస్థలకు అవకాశం ఇవ్వాలని చెప్పారు. రాష్ట్రంలో నిర్మించే నీటిపారుదల ప్రాజెక్టులు, మెట్రోరైల్ విస్తరణ, రైల్వేలైన్లు, ఇతర మాస్ ట్రాన్స్‌పోర్ట్‌ల విద్యుత్ అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు.


మహాసభల సావనీర్‌ను ఆవిష్కరించిన బివి రాఘవులు

సిపిఎం రాష్ట్ర మహాసభ సావనీర్ ఆవిష్కరణ

- మొదటికాపీని జాన్‌వెస్లీకి అందించిన బివి రాఘవులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
సిపిఎం రాష్ట్ర నాలుగో మహాసభ సావినీర్‌ను ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు శుక్రవారం హైదరాబాద్‌లోని ఎంబి భవన్‌లో ఆవిష్కరించారు. జనవరి 25 నుంచి 28వ తేదీ వరకు సంగారెడ్డి పట్టణంలో ఆ పార్టీ రాష్ట్ర మహాసభను నిర్వహించిన విషయం తెలిసిందే. రాష్ట్ర మహాసభ సందర్భంగా ఆహ్వాన సంఘం ముద్రించిన సావనీర్ మొదటి కాపీని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీకి బివి రాఘవులు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగారెడ్డి పట్టణంలో సిపిఎం రాష్ట్ర నాలుగో మహాసభ కార్మికుల కష్టార్జితంతో జరపడం దేశానికి మార్గం చూపిందని అన్నారు. సంగారెడ్డి పార్టీ ఉద్యమం పట్టుదలతో మహాసభను జయప్రదం చేయడానికి కృషి చేసిందని చెప్పారు. మహాసభ సందర్భంగా సావనీర్ ముద్రించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య, టి జ్యోతి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు, పి సుదర్శన్, రాష్ట్ర కమిటీ సభ్యులు జి జయరాజు, ఎం అడివయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహిళలతో కాళ్లు కడిగించడం అవమానకరం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
మిస్ వరల్డ్ పోటీలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించడమే అవమానకరమైన విషయమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శించారు. వరంగల్ జిల్లా పర్యటన సందర్భంగా పూరి గుడిసెలను మొత్తం ధ్వంసం చేసి వ్యాపారుల్లేకుండా చేసే కార్యక్రమానికి పాల్పడటం సరైంది కాదని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు హాజరైన వారి కాళ్లను తెలంగాణ మహిళలతో కడిగించడం, తుడిచే కార్యక్రమానికి పూనుకోవడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతటి దిగజారిన పద్ధతుల్లో వ్యవహరిస్తున్నదో అర్థమవుతున్నదని తెలిపారు. ఈ మొత్తం ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై పూర్తి విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని కోరారు.

లేబర్ కోడ్‌ల రద్దు కోసం 20న నిరసనలు : సిఐటియు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలనీ, ప్రభుత్వ రంగాన్ని రక్షించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న పని ప్రదేశాల్లో, మండల, పట్టణ, జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శలు, ర్యాలీలు చేయాలని సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితులరీత్యా ఈ నెల 20న జాతీయ కార్మిక సంఘాలు, స్వంతత్ర ఫెడరేషన్లు, అసోసియేషన్లు తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జూలై తొమ్మిదో తేదీకి వాయిదా వేసినట్టు తెలిపారు. 20న తలపెట్టిన నిరసన ప్రదర్శనలు, ర్యాలీలను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

చర్చిల వద్ద ట్రాఫిక్ చలాన్ల సమస్య నివారించాలి

- ప్రజావాణిలో బిషప్‌లు, పాస్టర్ల వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పరిధిలోని చర్చిల వద్ద ప్రతి ఆదివారం క్రిస్టియన్లు ప్రార్థనలు చేసే సమయంలో వాహనాలు రోడ్డు ప్రక్కన పెడుతుంటే ట్రాఫిక్ పోలీస్‌లు చలాన్లు వేస్తున్నారనీ, ఈ సమస్యను నివారించాలని బిషప్‌లు, పాస్టర్లు, క్రిస్టియన్ సంఘం ప్రతినిధులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో సిఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డికి శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సమస్యపై వెంటనే స్పందించిన చిన్నారెడ్డి డిజిపికి లేఖ రాశారు. చర్చిల వద్ద చలాన్ల సమస్య రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో పేర్కొన్నారు. క్రిస్టియన్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోనే సాల్మన్ రాజ్ నేతృత్వంలో ప్రతినిధులు ప్రజావాణికి వచ్చారు.

భూ భారతి చట్టం దేశానికే ఆదర్శం

- ప్రతి రైతుకూ భూ భద్రత కల్పిస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
భూ భారతి చట్టం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. గత ప్రభుత్వంలో ధరణి చట్టం లోపభూయిష్టంగా ఉన్నందున.. తాము వేలాది మంది ప్రజల అభిప్రాయాలతో భూభారతి చట్టాన్ని రూపొందించామని మంత్రి పొంగులేటి తెలిపారు. ప్రతి రైతుకూ భూ భద్రత కల్పించడమే తమ లక్ష్యమని తెలిపారు. భూ సరిహద్దులు, కొలతల్లో పారదర్శకత కోసం రిజిస్ట్రేషన్ వ్యవస్థలో మార్పులు తెచ్చామన్నారు. మండల కేంద్రాల్లో 6 వేల మంది ప్రయివేటు సర్వేయర్లకు శిక్షణ ఇచ్చి నియమించామని వివరించారు. రాబోయే రోజుల్లో మరో వెయ్యి మంది సర్వేయర్లను భర్తీ చేస్తామని తెలిపారు. గతంలో కుప్పకూలిన రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరిస్తామని, గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమించి భూ సమస్యలను అక్కడే పరిష్కరిస్తామని అన్నారు. అసైన్డ్ భూములకు కూడా హక్కులు కల్పిస్తామని, కోర్టులో లేని ప్రతి భూ సమస్యనూ పరిష్కరించడమే భూభారతి ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని చెప్పారు. త్వరలోనే రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని, రాబోయే 4 ఏండ్లలో 20లక్షల ఇండ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. భూమికి భూదార్ కార్డు ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ధరణి చట్టంతో వచ్చిన ఇబ్బందులను భూ భారతి తొలగిస్తుందని, మహిళా సంఘాలను ప్రోత్సహిస్తామని చెప్పారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. రుద్రంగి, భీమారంలో రెవెన్యూ కార్యాలయాలు, వేములవాడలో సబ్ రిజిస్టర్ కార్యాలయం ఏర్పాటు చేయాలని మంత్రులను కోరారు. వేములవాడ నియోజకవర్గానికి అదనంగా 1750 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినందుకు మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ.. భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి భూ భారతి పోర్టల్‌ను ప్రారంభించామని, రుద్రంగి మండలాన్ని పైలట్‌గా ఎంపిక చేసి 1027దరఖాస్తులు స్వీకరించామని తెలిపారు. రుద్రంగిలో 243 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశామన్నారు. మంత్రి, ఇతర అధికారులు భూ భారతి హెల్ప్ డెస్క్‌ను పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్, మార్కెట్ కమిటీ చైర్మెన్లు, ఎస్పీ, ఏఎస్పీ, ఆర్డీవో పాల్గొన్నారు.

పసుపు ప్రక్రియ కోసం ఆధునిక యంత్రాలు ఇవ్వాలి

- కేంద్రానికి రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి విజ్ఞప్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
పసుపు తీయడం, ఉడకబెట్టడం, పాలిష్ చేయడం తదితర అవసరాల కోసం నిజామాబాద్ పసుపు బోర్డుకు కేంద్రం ఆధునిక యంత్రాలివ్వాలని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీఆర్‌కేఆర్ భవన్‌లో కమిషన్ సభ్యులు భవానిరెడ్డి, భూమి సునీల్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. పసుపు రైతులకు న్యాయమైన ధర అందడం లేదని విమర్శించారు. మహారాష్ట్ర సాంగ్లీ మార్కెట్‌లో పసుపునకు ధర ఎక్కువగా వస్తున్నదని తెలిపారు. వచ్చే సీజన్‌కు ముందే కేంద్రం చొరవ తీసుకోవాలని కోరారు. రాజకీయాలను పక్కన పెట్టి రైతుల కోసం కురుకుమిన్ శాతం ఎక్కువగా ఉండే విత్తనాన్ని రైతులకు అందించాలని కోరారు. ప్రాసెస్ ఇండస్ట్రీస్ కోసం కృషి చేయడంతోపాటు ఒక బ్రాండ్ పేరుతో ఉత్పత్తి చేయాలని సూచించారు. ఆయా కంపెనీలు నకిలీ విత్తనాలను మార్కెట్‌లోకి తీసుకొస్తున్నాయన్నారు. సింజెంటా కంపెనీ మోసాలెన్నో ఉన్నాయని తెలిపారు. త్వరలో రాష్ట్రంలో విత్తన చట్టం తీసుకొస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కల్తీ విత్తనం రాజ్యమేలుతోందని చెప్పారు.

డిపోలు, బస్టాండ్లలో శానిటరీ నాప్కిన్ వెండింగ్ మిషన్లు

- ములుగు, హన్మకొండ బస్టాండ్లలో ఏర్పాటు చేయనున్న సహేలి సంస్థ
- పోస్టర్ ఆవిష్కరించిన మంత్రులు డాక్టర్ సీతక్క, పొన్నం ప్రభాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
సహేలి అనే స్వచ్ఛంధ సంస్థ సహకారంతో ములుగు, హన్మకొండ బస్టాండ్లలో శానిటరీ నాప్కిన్ వెండింగ్ మిషన్లను త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించనున్నది. ఆ తర్వాత రాష్ట్రంలోని అన్ని డిపోలు, బస్టాండ్లకు విస్తరించనున్నది. సాయ ప్రాజెక్టు కింద ఏర్పాటు చేయనున్న శానిటరీ నాప్కిన్ వెండింగ్ మిషన్ల గురించి అవగాహన కల్పించే పోస్టర్‌ను శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క), రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సహేలి స్వచ్ఛంధ సంస్థ నిర్వాహకురాలు కొమ్ము అనుపమ, తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ..నెలసరి సమస్యలు ఎదుర్కొంటున్న మహిళా ప్రయాణికుల సౌలభ్యం కోసం వినూత్న ఆలోచనతో శానిటరీ ప్యాడ్‌లను అందుబాటులో తీసుకొచ్చే ప్రాజెక్టు బాగుందని కొనియాడారు. పైలట్ ప్రాజెక్టు కింద ములుగు, హన్మకొండ బస్టాండ్లలో పదిరోజుల్లో ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఆ తర్వాత హుస్నాబాద్, హైదరాబాద్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోలకు విస్తరిస్తారని చెప్పారు. ఈ మేరకు ఆర్‌టిసితో సహేలి సంస్థ ఒప్పందం కుదుర్చుకున్నదని చెప్పారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీతక్క, పొన్నం తదితరులు

యాసంగిలో రికార్డు స్థాయి ధాన్యం

- 70.13 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యం : మంత్రి ఉత్తమ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
యాసంగి సీజన్‌లో 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఆయన ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యదర్శి డిఎస్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కొనుగోళ్లపై దుష్ప్రచారాన్ని అధికారులు తిప్పికొట్లని ఉన్నతాధికారులను, కలెక్టర్లను కోరారు. నిజానిజాలు ప్రజలకు బహిర్గతం చేసి రైతులకు భరోసా కల్పించడంలో కలెక్టర్లు చొరవ తీసుకోవాలని కోరారు.



యాసంగి లోనూ రికార్డ్ స్థాయిలో ధాన్యం దిగుబడి అయిందని, 60.14 లక్షల ఎకరాల్లో వరి ధాన్యం సాగు చేశారని చెప్పారు. 129.35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా ఉందన్నారు. 70.13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్ల ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. 2023 రబీ సీజన్‌లో మే15 నాటికి 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే, ఈ రబీ సీజన్లో అదే సమయానికి 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు జరిగాయని వివరించారు. ముందెన్నడూ లేని రీతిలోపెద్ద సంఖ్యలో ధాన్యం కొనుగోలు కోసం 8,348 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. 2021-22 రబీ సీజన్‌తో పోలిస్తే ఈ రబీ సీజన్‌లో అధికంగా 1,739 కేంద్రాలున్నాయని వెల్లడించారు. తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. కొనుగోళ్ల ప్రక్రియను కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ పర్యవేక్షించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. రానున్న 10,12 రోజులు కొనుగోళ్ల ప్రక్రియలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. క్షేత్ర స్థాయిలో లోపాలు గుర్తించి సత్వరమే పరిష్కరించాలని సూచించారు.

సుప్రీంతీర్పుతో గుంటనక్కలెవరో తెలిసింది

- బిఆర్ఎస్ అసెంబ్లీ విప్ కె.పి.వివేకానంద

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
కంచ గచ్చిబౌలి భూముల విషయంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో రాష్ట్రంలో గుంటనక్కలెవరో తెలిసిందని బిఆర్ఎస్ అసెంబ్లీ విప్ కె.పి.వివేకానంద విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. సుప్రీకోర్టు తీర్పును ప్రజలు స్వాగతిస్తున్నారని తెలిపారు. కోర్టు చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతున్నాయని చెప్పారు. కోర్టు సెలవుల సమయంలో గుంట నక్కల్లా చెట్లు నరికారనీ, రూ.10 వేల కోట్లకు కక్కుర్తి పడి ప్రజలను తప్పుదారి పట్టించారనీ, సిఎం రేవంత్ రెడ్డి దొంగలా దొరికిపోయారని తెలిపారు. ముఖ్యమంత్రి తీసుకునే నిర్ణయాలు రాష్ట్రానికి శాపంగా మారాయనీ, తెలంగాణ పరువును మంటకలిపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చెట్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రూ.10 వేల కోట్ల రుణంపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. రూ.10 వేల కోట్ల ఆర్థిక అవకతవకల్లో బిజెపి పాత్ర ఉన్నందునే కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేసినా విచారణ చేయడం లేదని ఆరోపించారు.

ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై ఎస్‌సి,ఎస్‌టి అట్రాసిటీ కేసు పెట్టడాన్ని ఖండించారు. రాములు నాయక్ కోడలికు మార్కులు ఎలా వచ్చాయని ప్రశ్నించడం తప్పా? అని ప్రశ్నించారు. ఎవరు ప్రశ్నించినా కేసులు పెడుతున్నారని విమర్శించారు. గిరిజన విద్యార్థులు స్కాలర్ షిప్పులు రాక విదేశాల్లో రోడ్లపై తిరుగుతున్నారనీ, రాష్ట్ర మంత్రివర్గంలో గిరిజనులకు చోటు కల్పించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ గ్రూప్ 1 విద్యార్థుల రోడ్డెక్కితే, కోర్టు సందేహాలు లేవనెత్తిందని గుర్తుచేశారు. పరీక్ష రాసిన వారి కంటే 10 మందికి ఎక్కువగా ఫలితాలను టిజిపిఎస్‌సి ప్రకటించిందని తెలిపారు. కోఠి ఉమెన్స్ కాలేజీలో 12.61 శాతం మంది గ్రూప్1కు ఎంపికయ్యారని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న, పుస్తకాలు రాసిన వారికి తక్కువ మార్కులు వచ్చాయని చెప్పారు. తమపై కేసులు పెట్టినా ప్రశ్నించడం ఆపేది లేదని స్పష్టం చేశారు.

త్వరలో 'కాళేశ్వరం' విచారణ పూర్తి

- మూడో వారంలో సర్కారుకు నివేదిక?
- కెసిఆర్, హరీశ్, ఈటలకు నోటీసుల్లేవు !?

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
కాళేశ్వరం నీటిపారుదల ప్రాజెక్టు విఫలంపై సర్కారు నియమించిన న్యాయ విచారణ త్వరలో ముగిసే అవకాశాలు కనిపిస్తున్నాయి. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి రిటైర్డ్ జడ్జి పిసి ఘోష్ దాదాపు గత ఏడాది కాలంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పగుళ్లు, సిపేజీలు, ప్లానింగ్, డిజైన్లు, డ్రాయింగ్‌లతోపాటు అవకతవకలు తదితర అంశాలపై విచారణ చేపట్టిన సంగతి తెలిసిందే. ఇప్పటికే దాదాపు వంద మందికిపై అధికారులు, ఇంజనీర్లు, వర్కింగ్ ఏజెన్సీలను విచారించారు. బహిరంగ విచారణకు పిలిచారు. ప్రశ్నలేశారు. అఫిడవిట్లు తీసుకున్నారు. కొంత మంది డ్రాప్ బాక్స్ ద్వారా ఫిర్యాదు చేశారు. మరికొందరు నేరుగా జడ్జిని కలిసి వినతిపత్రాలు ఇచ్చారు. ఇదిలావుండగా కమిషన్ విచారణ గడువు ఈ నెల 31తో ముగియనుంది. మరోసారి పొడిగించే అవకాశం లేదని అధికారిక సమాచారం. దీంతో జడ్జి పిసి ఘోష్ వేగంగా విచారణను పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. కాగా కాళేశ్వరం నిర్మాణంలో కీలకభూమిక పోషించిన మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రులు తన్నీరు హరీష్‌రావు, ఈటల రాజేందర్ తదితరులకు సైతం నోటీసులు ఇస్తారని విచారణ క్రమంలో అందరూ భావించారు. అయితే, అలాంటి పరిస్థితి ప్రస్తుతం లేదని తెలిసింది.కాగ్, విజిలెన్స్, ఎన్డీఎస్ఏ నివేదికలను కూడా కమిషన్ పరిశీలించింది. ప్రభుత్వానికి అందజేయాల్సిన నివేదిక జస్టిస్ ఘోష్ ఇప్పటికే రూపొందించినట్టు తెలిసింది. ఇప్పటి వరకు జరిగిన విచారణ ప్రక్రియను ఒకసారి సమీక్ష చేసుకుని, ఆ నివేదికకు తుదిమెరుగులు దిద్దేపనిలో జస్టిస్ ఘోష్ ఉన్నట్టు బిఆర్‌కె భవన్‌లోని కమిషన్ వర్గాలు చెబుతున్నాయి. ఎలాంటి ఆటంకాలు ఉత్పన్నం కాకపోతే ఈ నెల మూడో వారంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని స్వయంగా కలిసి నివేదిక ఇచ్చే అవకాశాలు ఉన్నాయని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. కాళేశ్వరం న్యాయవిచారణ నివేదిక చాలా స్పష్టంగా వచ్చే పరిస్థితి ఉందని తెలిసింది. అన్నీ అంశాలను పరిశీలించిన అనంతరం, అవినీతి అవకతవకలను కుండబద్దలుకొట్టేలా నివేదిక ఉంటుందని సమాచారం.

మాజీ, తాజా అధికారులు స్టేట్‌మెంట్లు, అఫిడవిట్ల సమాచారమే ఇందుకు ఉపయోగించుకుని నివేదిక ఇవ్వనున్నట్టు సమాచారం. ప్రాజెక్టు ప్రణాళిక దశ నుంచే తప్పిదాలు దొర్లినట్టు జస్టిస్ పిసి ఘోష్ నివేదికలో పొందుపరిచారని సమాచారం. రూ.లక్ష కోట్ల ప్రాజెక్టు కట్టి మూడేళ్లకే కుప్పకూలిన నేపథ్యంలో ఎవరు బాధ్యులు కానున్నారో ఈ నెలఖరులోగా తేలనుంది. కమిషన్‌కు జ్యూడిషియల్ అధికారాలు కల్పించిన నేపథ్యంలో ఆ నివేదిక అధారంగా అధికారులు, రాజకీయ నేతలపై చర్యలు తీసుకునే అవకాశం ప్రభుత్వానికి ఉంది.



కలిసి పని చేస్తే.. మంచి ఫలితాలు

- ఎక్సైజ్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో
డ్రగ్ కంట్రోల్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలు కలిసి పని చేస్తే మంచి ఫలితాలొస్తాయనీ, ఎప్పటికప్పుడు సమాచారాన్ని సమన్వయంతో పాలు పంచు కుంటే ఉహించని రీతిలో ప్రగతి కనబడుతుందని డ్రగ్ కంట్రోల్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్ ఆఫ్ ఎన్ఫోర్స్మెంట్ షానవాజ్ ఖాసీం అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని అబ్కారీ భవన్‌లో ఎక్సైజ్, డ్రగ్స్ కంట్రోల్ అధికారుల సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాసీం మాట్లాడుతూ ప్రాణహాని, మత్తు కలిగించే నిషేధిత మందుల వినియోగం, డ్రగ్స్, గంజాయి, ఇతర రకాల మత్తు మందుల వినియోగంతో యువత ఎంతో నష్టపోతున్నారని తెలిపారు. ఈ విషయంలో ఏ శాఖకు ఆ శాఖ పనులు తన చేసుకోవటంతోపాటు ప్రత్యేక సందర్భాల్లో రెండు శాఖలు కలిసి ప్రత్యేక దాడులు నిర్వహించడం, సమాచారాన్ని పంచుకోవటం మేలని చెప్పారు. రెండు శాఖలు కలిసి పని చేయడానికి ఉన్న అవకాశాలలపై చర్చించు కోవాలనీ, కలిసి దాడులు చేయడానికి ప్రాంతాలను గుర్తించి ముందుకు సాగాలన్నారు. రెండు విభాగాల్లో సమాచార వ్యవస్థను వృద్ధి చేసుకోవడానికి నలుగురితో కూడిన కామన్ ఇంటిలీజెన్స్ టీమ్‌ను ఏర్పాటు చేసకోవాలని సూచించారు.

ఇండస్ట్రియల్, ఫోరెన్సీ ల్యాబ్‌లు, జాయింట్ ట్రెయినింగ్, రైడ్స్, వాట్సాప్ గ్రూప్, ఇంటర్‌నేట్‌లో జరుగుతున్న డ్రగ్, వాటి వ్యాపారాలపై ప్రత్యేక దష్టి పెట్టాలని కోరారు. ఈ కార్య చరణకు ఒక రూట్‌మ్యాప్‌ను బుక్ లేట్ రూపంలో తీసుకు రావాలన్నారు. సమావేశంలో ఎక్సైజ్ శాఖ జాయింట్ డైరెక్టర్ సయ్యద్ యాసిన్ ఖురేషి, డ్రగ్ కంట్రోల్ జాయింట్ డైరెక్టర్ రామ్‌ధన్, డిప్యూటి కమిషనర్లు కెఎబి శాస్త్రీ, పి.దశరథ్, అడిషనల్ ఎప్పీ భాస్కర్, అసిస్టెంట్ డైరెక్టర్ డి.సరిత , అసిస్టెంట్ కమిషనర్ ప్రణవీ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీటితో తడిసిన ధాన్యం

- ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల మధ్య వివాదంతో ఘటన?
- రూ.40 వేలు ఇస్తేనే కొనుగోలు కేంద్రం పెట్టుకోవాలని డిమాండ్
- మాజీ ఎంపిటిసి సభ్యునిపై ఫిర్యాదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల మధ్య వివాదంతో మిషన్ భగీరథ నీటితో రైతులు ఆరోబోసిన ధాన్యాన్ని తడిపేశారు. బుర్రకాయలగూడెం కొనుగోలు కేంద్రాలపై రాజకీయరంగు అలుముకుంది. అధికార పార్టీకి చెందిన మాజీ ఎంపిటిసి సాగర్.. జీవనజ్యోతి కొనుగోలు కేంద్రం నిర్వాహకుల మధ్య గురువారం వివాదం చోటుచేసుకుంది. రూ.40 వేలు ఇస్తేనే కొనుగోలు కేంద్రం పెట్టుకోవాలని ఆంక్షలు విధించడమే కాక తనకు కూడా (ఒడిఎస్ఎంఎస్) కొనుగోలు కేంద్రం వచ్చిందని, గణపురం వాళ్లు ఇక్కడ సెంటర్ పెట్టొద్దంటూ మాజీ ఎంపిటిసి కొనుగోలు కేంద్రం నిర్వాహకులను బెదిరించారు. తీరా రాత్రికి రాత్రే ఏమైందో కానీ మిషన్‌భగీరథ నీటితో రైతులు ఆరబోసిన ధాన్యం రాశులు తడిసి ముద్దయ్యాయి. దాంతో



తడిసి ముద్దయిన ధాన్యం

బుర్రకాయలగూడెం మాజీ ఎంపిటిసి సభ్యుడు సాగర్‌పై జీవనజ్యోతి విఒ ఐకెపి సెంటర్ నిర్వాహకులు ఏగోళం శ్రీదేవి, శ్రీపతి అలివేలు, ఆకుల రేణుక, కనుకుంట్ల భద్రమ్మ, మోటపోతుల జయ.. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రైతులు, జీవనజ్యోతి విఒ కొనుగోలు కేంద్రం నిర్వాహకుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.

గణపురం గ్రామానికి చెందిన జీవనజ్యోతి వీవోకు కొనుగోలు కేంద్రం మంజూరయింది. ఆ నిర్వాహకులు గణపురంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చేతులు మీదుగా 20 రోజుల క్రితం కేంద్రాన్ని ప్రారంభించారు. ఇక్కడ స్థలం లేకపోవడంతో గణపురం నుంచి బుర్రకాయలగూడెంలో కూడా సెంటర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. అప్పటికే రైతులు ఆ కల్లాల వద్ద ధాన్యం ఆరబోసుకున్నారు. దాంతో ఆ గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి సాగర్ కొనుగోలు కేంద్రం నిర్వాహకుల వద్దకు వచ్చి తనకు రూ.40 వేలు ఇవ్వాలని, కొనుగోలు కేంద్రం స్థలాన్ని తానే శుభ్రం చేయించానని కేంద్రం నిర్వాహకులతో వాగ్వివాదానికి దిగాడు. అంతేకాక తనకు (ఒడిఎస్ఎంఎస్) సెంటర్ వచ్చిందని, బుర్రకాయలగూడెంలో మీరు సెంటర్ తీసేయాలని ఆంక్షలు విధించాడు. దాంతో సెంటర్ నిర్వాహకులు గురువారం ఇంటికి వచ్చారు. గురువారం రాత్రి ఏమైందో కానీ కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన మాదాసు రవి, ముత్యాల మొగిలి, రాజు తదితర రైతులకు చెందిన పది ఎకరాల ధాన్యం మొత్తం మిషన్‌భగీరథ నీళ్లలో తడిసి ముద్దయింది. శుక్రవారం రైతులు అక్కడికి వచ్చి చూడగా ధాన్యం మొత్తం నీళ్లల్లో తేలాడటంతో రైతులు లబోదిబోమన్నారు. కల్లాల వద్ద ఆరబోసిన ధాన్యం ఇలా కావడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సాగర్ కావాలనే మిషన్ భగీరథ నీటిని వదిలిపెట్టి తమ ధాన్యాన్ని తడిపించారని తెలిపారు. రెండు కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల మధ్య జరిగిన వివాదంలో తాము నష్టపోయామన్నారు. మొన్నటి వరకు వర్షాలతో ధాన్యం తడిసి నష్టపోయామని, ఆరబెట్టి తీరా ధాన్యం కొనుగోలు కేంద్రం వద్దకు తీసుకు వస్తే ఇక్కడ కూడా ధాన్యం మొత్తం తడిసి ముద్దయిందని వాపోయారు. దీనికి ఎవరు సమాధానం చెబుతారని, తమకు నష్టపరిహారం ఎవరు చెల్లిస్తారంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై జీవనజ్యోతి వీవో, ఐకేపీ సెంటర్ నిర్వాహకులు మాజీ ఎంపీటీసీ సాగర్‌పై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

చట్టవిరుద్ధంగా మందుల నిల్వలు

- డిసిఎ దాడుల్లో పట్టివేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చట్టవిరుద్ధంగా నిల్వ ఉంచిన ఔషధాలను డ్రగ్ కంట్రోల్ అధికారులు పెద్ద మొత్తంలో స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ మండలం, నాచారం గ్రామం, నాచారం ఐడిఎలో ఇండియన్ డ్రగ్స్ అండ్ కెమికల్స్ గోడౌన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ రూ.2.25 లక్షల విలువైన వివిధ రకాల మందులను సీజ్ చేశారు. లైసెన్స్ లేకుండా చేస్తున్న తయారీదారుల వల్ల ప్రజారోగ్యానికి ప్రమాదమని అధికారులు హెచ్చరించారు. దీనిపై విచారించి చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్టు వెల్లడించారు. ఇలాంటి చర్యలు డ్రగ్స్ అండ్ కాస్మోటిక్స్ యాక్ట్ కింద నేరాలని, దీనికి గరిష్టంగా ఐదేళ్ల వరకు జైలుశిక్ష విధించే అవకాశముందని అధికారులు హెచ్చరించారు.



ప్రతిభకు వయసు అడ్డంకి కాదు

ప్రజాశక్తి కల్చరల్

నిజమైన ప్రతిభా సంపత్తి ఉంటే వయసు కళా కారులకు అడ్డంకి కాదని కేంద్ర పూర్వ మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి అన్నారు. రామ కృష్ణ మధుర గళ సంపన్నుడు అని ఆయన వయసుకు వాయిస్‌కు సంబంధం లేదని ప్రశంసించారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై ప్రముఖ సాంస్కృతిక సంస్థ గంటిస్ నిర్వాహణలో ప్రముఖ గాయకుడు వైఎస్ రామ కృష్ణ అరవై వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అభినందన సత్కారం జరిగింది. ముఖ్య అతిథిగా డాక్టర్ వేణు గోపాలా చారి పాల్గొని రామకృష్ణ భార్య లలిత కూడా గాయని కావడం ఇరువురు అభిరుచి ఒక్కటే కావడం అదృష్టం అన్నారు. బిసి కమిషన్ పూర్వ చైర్మన్ డాక్టర్ వకుళా భరణం కృష్ణ మోహన్‌రావు మాట్లాడుతూ నాలుగున్న దశాబ్దాలు గా వివిధ వేదికలపై గానం చేస్తూ విదేశాల లోనూ ప్రదర్శనలు ఇచ్చి అక్కడ తెలుగువారిని ఆకట్టుకున్న రామకృష్ణ విఖ్యాత గాయకులు ఘంటసాల, బాలు, బాల మురళీ గలాలను అనుకరించే ప్రతిభా వంతుడని అభినిందించారు. డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ బి రాజ గోపాల్‌రావు మాట్లాడుతూ రామకృష్ణ జీవితాంతం పాడుతూ ఉంటారని ఆయన స్వరానికి విశ్రాంతి లేదని అన్నారు. కాంగ్రెస్ నాయకుడు నిరంజన్ వ్యాపారవేత్త అగర్వాల్ వంశీ రామరాజు కిన్నెర రఘురాం ఓంకార్ రాజు దైవజ్ఞ శర్మ తదితరులు పాల్గొనగా సంస్థ అధ్యక్షులు గంటి రామకృష్ణ నిర్వహణలో వైఎస్ రామకృష్ణను అతిథులు సత్కరించి కళా కౌస్తుభ బిరుదు ప్రదానం చేశారు.

ప్రేమ పేరుతో వేధింపులు

- పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు కేసు నమోదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇన్‌స్ట్రాగ్రామ్‌లో పరిచయమైన ఓ బాలికను ప్రేమ పేరుతో వేధింపులకు పాల్పడుతున్న యువకుడిపై కేసు నమోదైంది. ఈ ఘటన మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. అవుషాపూర్‌కు చెందిన గుర్రం అవినాష్‌రెడ్డికి అదే గ్రామానికి చెందిన ఓ బాలికతో ఇన్‌స్ట్రాగ్రామ్‌లో పరిచయమైంది. ఆ పరిచయం ప్రేమగా మారింది. దీంతో తనతో చనువుగా ఉన్నప్పుడు తీసుకున్న ఫొటోలతో కొద్ది రోజుల తర్వాత బ్లాక్‌మెయిల్‌కి దిగాడు. బాలికతోపాటు ఆమె చెల్లెలును కూడా తన దగ్గరకు పంపాలని వేధించాడు. నగలు, నగదు తీసుకురావాలని, లేకుంటే తనతో ఉన్న ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ చేస్తానని బెదిరించాడు. దీంతో ఆ బాలిక ఇంట్లోని 6 తులాల బంగారు ఆభరణాలను అతడికి అప్పగించింది. విషయం ఇంట్లో తెలియడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా, తీసుకున్న నగలను తిరిగిచ్చాడు. కొన్నాళ్ల తర్వాత మళ్లీ చెల్లెలు ప్రస్తావన తెచ్చి బెదిరింపులకు పాల్పడుతుండడంతో తండ్రి బాలికతో కలిసి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ సేల్ డీడిల తయారీ

- భూ పత్రాలు, క్యాస్ట్, ఇన్‌కం, బర్త్ సర్టిఫికెట్లు రూ.5 వేల నుంచి 20 వేలకు విక్రయం
- ఆరుగురిని అరెస్టు చేసిన పోలీసులు
- 30 ఏళ్లనాటి పేపర్లు, డాక్యుమెంట్లు, రబ్బర్ స్టాంపులు స్వాధీనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నకిలీ సేల్ డిడిలు, భూపత్రాలు, ఇతర సర్టిఫికెట్లు తయారు చేస్తున్న ముఠాను రాచకొండ పోలీసులు అరెస్టు చేశారు. సేల్ డిడిలు, భూ పత్రాలు, ఇన్‌కం, బర్త్ సర్టిఫికెట్లు తదితర డాక్యుమెంట్లను తయారు చేస్తున్న 13 మంది ముఠా సభ్యుల్లోని ఆరుగురు నిందితులను సరూర్‌నగర్, ఎల్బీనగర్ ఎస్ఒటి పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. నిందితుల నుంచి 546 బాండ్ పేపర్స్, 48 బర్త్ సర్టిఫికెట్లు, 11 ఆదాయం సర్టిఫికెట్లు, 5 క్యాస్ట్ సర్టిఫికెట్లు, 30 ఏళ్ల కిందటి పేపర్స్, జిహెచ్ఎంసి, న్యూరో సర్జన్ డాక్టర్లు, రెవెన్యూ, నోటరీలకు చెందిన రబ్బర్ స్టాంప్స్, రసాయనాలు, పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు, రెవెన్యూ, జిహెచ్ఎంసి, కోర్టులు సైతం గుర్తించలేని విధంగా నకిలీ సేల్ డిడిలు, ఇతర డాక్యుమెంట్లు తయారు చేస్తున్నారని రాచకొండ సిపి జి.సుధీర్‌బాబు తెలిపారు. శుక్రవారం ఎల్బీనగర్‌లోని సిపి క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.


వివరాలను తెలుపుతున్న సిపి సుధీర్‌బాబు

హయత్‌నగర్ కుంట్లూర్‌కు చెందిన తోట వెంకట భానుప్రసాద్, ఆయన భార్య సాగరిక కలిసి స్థానికంగా 'సాత్విక్ ఎంటర్‌ప్రైజెస్'ను నిర్వహిస్తున్నారు. డీటీపీ వర్క్ చేసే వారు. అద్దె అగ్రిమెంట్లు, సేల్ డీడీలు, అఫిడవిట్‌లపై టైప్ చేసేవారు. ఈ క్రమంలో లైసెన్స్ స్టాంప్ వెండర్లయిన హయత్‌నగర్‌కు చెందిన ఏ.చంద్రశేఖర్, అతని కుమారుడు అనిల్‌తో పరిచయం ఏర్పడింది. తద్వారా పాత స్టాంప్ పేపర్స్, నకిలీ డాక్యుమెంట్లు తయారు చేసి అధిక ధరలకు విక్రయించడం ప్రారంభించారు. ఈ క్రమంలో సివిల్ కోర్టులో డాక్యుమెంట్ రైటర్‌గా పనిచేస్తున్న సయ్యద్ ఫెరోజ్ అలీ, అంబర్‌పేట్‌కు చెందిన ఎండీ జలీల్‌తోనూ వారికి పరిచయం ఏర్పడింది. నకిలీ డాక్యుమెంట్లు, సేల్ డీడీల తయారీతో కష్టపడకుండా డబ్బులు వస్తుండటంతో వరంగల్‌కు చెందిన పి.మహేష్‌గౌడ్, కామారెడ్డి మున్సిపాల్టీలో ఔట్‌సోర్సింగ్ విభాగంలో పనిచేస్తున్న ప్రవీణ్, నార్సింగ్ మున్సిపాల్టీలో పనిచేస్తున్న డి.సుధీర్ కుమార్ (ఔట్ సోర్సింగ్), బండ్లగూడ మున్సిపాల్టీలో పనిచేస్తున్న ముద్దసర్ (ఔట్ సోర్సింగ్)తో చేతులు కలిపారు. వారి సహాయంతో కులం, బర్త్, ఆదాయం సర్టిఫికెట్లతోపాటు ఇతర సర్టిఫికెట్లు తయారు చేస్తున్నారు. ఆస్పత్రులు, రెవెన్యూ నుంచి ఎలాంటి డాక్యుమెంట్లు లేకుండానే నకిలీవి సృష్టిస్తున్నారు. దాంతోపాటు చౌటుప్పల్‌కు చెందిన జలీల్ కిషోర్, ఖమ్మంకు చెందిన చెంచల నిఖిల్, దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన సత్యప్రభుతో కలిసి రబ్బర్ స్టాంప్‌లు, నకిలీ సేల్ డీడీలు కూడా తయారు చేస్తున్నారు. మొత్తం 13 మంది ఒక ముఠాగా ఏర్పడ్డారు. బ్యాంక్ లోన్లు తీసుకునే వారికి, కోర్టులో కేసులు వేసేవారితోపాటు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే వారికి డాక్యుమెంట్లు, సర్టిఫికెట్లను విక్రయిస్తున్నారు. ఒక్కో సర్టిఫికెట్ రూ.5వేల నుంచి రూ.20వేల వరకు విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు నిఘా వేసి ఆరుగురిని అరెస్టు చేశారు. పరారీలో ఉన్న వారి కోసం గాలిస్తున్నారు. నకిలీ డాక్యుమెంట్లతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీ సూచించారు. డాక్యుమెంట్లపై అనుమానం వస్తే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో లేదా ప్రభుత్వ వెబ్‌సైట్‌లో పరిశీలించాలని చెప్పారు. కేసును ఛేదించిన ఎస్ఒటి, సరూర్‌నగర్ పోలీసులను సిపి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ షాకీర్ హుస్సేయిన్, ఎల్బీనగర్ ఏసీపీ కిష్టయ్య, సరూర్‌నగర్ సీఐ సైదిరెడ్డి, ఎస్‌వోటీ సీఐ వెంకటయ్య తదితరులు ఉన్నారు.



అమెరికా కాన్సులేట్‌తో వై యాక్సిస్ ఫౌండేషన్ ఒప్పందం

ప్రజాశక్తి - హైదరాబాద్

భారత్‌లోని విద్యార్థులకు అమెరికాలో విద్యను మరింత చేరువ చేయడానికి వీలుగా యుఎస్ కాన్సులెట్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు వై యాక్సిస్ ఫౌండేషన్ తెలిపింది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా విద్యార్థులకు యుఎస్‌లో విద్యను విశ్వసనీయంగా మార్చడానికి వీలుగా యుఎస్ రాయబార కార్యాలయంతో జట్టు కట్టినట్లు ఆ సంస్థ పేర్కొంది. వై యాక్సిస్ ఫౌండేషన్ కార్యాలయంలో జరిగిన ఈ ఒప్పందంలో అమెరికా కాన్సులేట్ జనరల్ హైదరాబాద్ జెనిఫర్ లార్సన్, వై ఆక్సిస్ ఫౌండేషన్ ట్రస్టీ జేవియర్ అగస్టిన్ పాల్గొన్నారు. యుఎస్‌లో చదువుకోవాలనుకునే వారికి అవసరమైన, కచ్చితమైన పూర్తి సమాచారం తమ వద్ద లభిస్తుందని అగస్టిన్ పేర్కొన్నారు.

కెటిఆర్‌కు మరో ప్రతిష్టాత్మక ఆహ్వానం

- 30న యుకెలోని ఆటోమొబైల్ ఇంజనీరింగ్ సర్వీసెస్ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె తారక రామారావుకు మరో ప్రతిష్టాత్మక ఆహ్వానం అందింది. లండన్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రముఖ ఆటోమొబైల్ ఇంజనీరింగ్ సర్వీసెస్ సంస్థ ప్రాగ్మాటిక్ డిజైన్ సొల్యూషన్స్ లిమిటెడ్ (పిడిఎస్ఎల్), యుకెలోని వార్విక్ టెక్నాలజీ పార్క్‌లో ఏర్పాటు చేసిన నూతన కేంద్రాన్ని ప్రారంభించాలంటూ ఆహ్వానించింది. ప్రపంచంలోనే అతిపెద్ద, విలువైన కారు బ్రాండ్ అయిన మైక్లారెన్, ఆస్టన్ మార్టిన్, జాగ్వార్ ల్యాండ్ రోవర్ వంటి ప్రముఖ ఆటో దిగ్గజాలకు సేవలు అందిస్తున్నది. ఈనెల 30న యూకేలోని వార్విక్ యూనివర్సిటీ సైన్స్ పార్క్‌లోని పరిశోధన కేంద్రాన్ని కేటీఆర్ ప్రారంభించనున్నారు. శుక్రవారం ఆయనకు ఆహ్వానాన్ని అందించింది. కేటీఆర్ చేతుల మీదుగా తమ కేంద్రం ప్రారంభం కావడం గర్వకారణమని ఆ సంస్థ డైరెక్టర్ క్రాంతి పుప్పాల తెలిపారు. పిడిఎస్ఎల్ ఆహ్వానం పట్ల కెటిఆర్ హర్షం వ్యక్తం చేశారు. తాను వ్యక్తిగతంగా ఈ ప్రారంభోత్సవానికి హాజరవుతానన్నారు.

స్ట్రింగ్ మెటవర్స్ రెవెన్యూలో 169 శాతం వృద్ధి


హైదరాబాద్ : గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లను రూపొందించే స్ట్రింగ్ మెటావర్స్ లిమిటెడ్ ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు సాధించినట్లు ప్రకటించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం (2024-25)లో 169.40 శాతం వృద్ధితో రూ.407.36 కోట్ల రెవెన్యూ నమోదు చేసినట్లు పేర్కొంది. 225.79 శాతం వృద్ధితో రూ.35.25 కోట్ల నికర లాభాలు ఆర్జించినట్లు వెల్లడించింది. క్రితం ఏడాది 2023-24లో రూ.10.82 కోట్ల లాభాలు ప్రకటించింది. సెబీ నిబంధనలకు అనుగుణంగా తదుపరి రైట్ ఇష్యూను ప్రకటించడం ద్వారా పబ్లిక్ షేర్‌హోల్డింగ్‌ను 25 శాతానికి చేర్చనున్నట్లు ఆ కంపెనీ తెలిపింది.

ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు

- మహిళల ఆరోగ్యానికి మరింత ప్రాధాన్యత : డాక్టర్ క్రిస్టీనా జెడ్ చొంగ్తూ
- ఎఐజి ఆస్పత్రిని సందర్శించిన మిస్ వరల్డ్ పోటీదారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యరంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చిందని వైద్యారోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టీనా జెడ్ చొంగ్తూ తెలిపారు. మెడికల్ టూరిజంలో భాగంగా శుక్రవారం మిస్ వరల్డ్ పోటీదారులు హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఎఐజీ ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా వారికి బతుకమ్మలతో ఆస్పత్రి నిర్వాహకులు స్వాగతం తెలిపారు. వారు ఆస్పత్రిని ఐసియులో చికిత్స పొందుతున్న చిన్నారులను పరామర్శించి పలుకరించారు. వారికి బహుమతులను అందజేశారు. ఫోటోలు దిగారు. ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో అందుతున్న వివిధ రకాల సేవలను డాక్టర్లు, సిబ్బంది వారికి వివరించారు. ఈ సందర్భంగా క్రిస్టీనా మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా మహిళలు అనేక పాత్రలను పోషిస్తున్నారనీ, తల్లులుగా, కుమార్తెలుగా, ఆరోగ్య సంరక్షణ కార్మికులుగా, వృత్తిపరంగా పని చేస్తున్నారని తెలిపారు. మహిళల ఆరోగ్యం అనేది ఒక మౌలికాంశమని అర్థం చేసుకోవడం అత్యంత కీలకమని సూచించారు. మహిళల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మహిళలుగా మనం ప్రాధాన్యమిస్తే కార్యాలయాలు, సమాజం మరింత బలోపేతమౌతాయని వివరించారు. మహిళల్లో క్యాన్సర్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం అధునాతన ఆస్పత్రుల్లో సేవలు అందిస్తున్నామని అన్నారు. మెడికల్ కాలేజీల్లో అన్ని సౌకర్యాలు



ఉండేలా రూపాకల్పన చేస్తున్నామని అన్నారు. మహిళల కోసం ప్రత్యేకంగా ఒక రోజు మహిళా డాక్టర్లు, సిబ్బందితో చికిత్సలందిస్తున్నామనీ, తద్వారా మహిళలు తమ ఇబ్బందులను మరింత స్వేచ్ఛగా చెప్పుకునే వెసులుబాటు కలుగుతున్నదన్నారు.

ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి వారికి ఆసుపత్రి ప్రత్యేకతలను వివరించారు. తమ వద్ద జరుగుతున్న చికిత్స విధానాలను, పరిశోధనల తీరును వివరించారు. ఆరోగ్య రంగంలో సాధించిన పురోగతిని, బ్రెస్ట్ వెల్‌నెస్,'గట్' (జీర్ణ వ్యవస్థ), వంటి అంశాలను ప్రచారం చేయాలని వారికి సూచించారు. వైద్య రంగంలో వస్తున్న అధునాత మార్పులు, మహిళల్లో వస్తున్న వ్యాధులను ఆయన వారికి వివరించారు. ప్రతి ఒక్కరూ ఆహారం, ఆరోగ్యంపై దృష్టి పెడితే సమాజం ఎంతో ఉన్నతంగా ఉంటుందని సూచించారు. ఆస్పత్రిని సందర్శించిన విస్ వరల్డ్ పోటీదారులు కూడా తమ అభిప్రాయాలను నాగేశ్వరరెడ్డితో పంచుకున్నారు. ఏఐ రంగంలో వస్తున్న మార్పులు, దాన్ని ఏఐజీ ఆస్పత్రి ఎలా అందిపుచ్చుకుంటుందన్న విషయాలను వారు అడిగి తెలుసుకున్నారు.


షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ఉర్విష్ షా

బియు4 ఆటో షోరూమ్ ప్రారంభం

హైదరాబాద్ : విద్యుత్ వాహనాల కంపెనీ బియు4 ఆటో సికింద్రాబాద్‌లో ప్రత్యేక షోరూమ్‌ను ఏర్పాటు చేసింది. దీనిని ఆ సంస్థ ఎండి, చైర్మన్ ఉర్విష్ షా లాంఛనంగా ప్రారంభించారు. దీనిని ఎంవి ఆటోమొబైల్స్ భాగస్వామ్యంతో ఏర్పాటు చేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నాటికి వందకుపైగా స్టోర్లను ప్రారంభించే లక్ష్యంతో ఉన్నామని ఉర్విష్ తెలిపారు. నెలకు ఐదు వేల యూనిట్ల విక్రయ లక్ష్యమన్నారు. దేశంలో ద్విచక్ర వాహనాల మార్కెట్ నెలకు 80 లక్షల యూనిట్లు అన్నారు. అందులో కేవలం 1.3 లక్షల యూనిట్లే ఎలక్ట్రిక్ వాహనాలు ఉన్నాయన్నారు. ఈ అవుట్‌లెట్ దక్షిణాది విస్తరణలో కీలక మైలురాయి అన్నారు.

కలుపు మందు తాగి బిటెక్ విద్యార్థిని మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కలుపుమందు తాగి బిటెక్ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థిని శుక్రవారం ఆత్మహత్య ఘటన ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం నారాయణపురం గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపురం గ్రామానికి చెందిన చీకటి దీప్తి (28) గంగారం సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ ఫైనలియర్ చదువుతోంది. ఈ నెల 14న తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురై ఇంటి ఆవరణలో ఉన్న కలుపుమందును తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న నేపథ్యంలో ప్రభుత్వాస్పత్రి వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం ఖమ్మంలోని ఓ ప్రయివేట్ హాస్పటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ విద్యార్థిని దీప్తి శుక్రవారం మరణించింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం దీప్తి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. సత్తుపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రివర్గ విస్తరణకు రేవంతే అడ్డు

- తెలంగాణలో త్వరలో ఆర్థిక ఎమర్జెన్సీ
- అందుకే సిఎస్‌గా రామకృష్ణారావు నియామకం : మహేశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో మంత్రివర్గ విస్తరణకు ప్రధాన అడ్డంకిగా సిఎం రేవంత్‌రెడ్డే ఉన్నాడనీ, ఈ విషయంలో ఆశావాహులను ఎగదోస్తూ, ఆయా సామాజిక తరగతుల వారితో లెటర్లు ఇప్పిస్తూ జగన్నాటకం ఆడుతున్నారని బిజెపి ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో త్వరలో ఆర్థిక ఎమర్జెన్సీ ప్రకటించబోతున్నారనీ, అందుకే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణారావును నియమించారని అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో మీడియా ప్రతినిధులతో ఆయన చిట్‌చాట్ నిర్వహించారు. తనకనుకూలమైన వారికి మంత్రి పదవులు వచ్చే అవకాశం లేకపోవడంతో రేవంత్‌రెడ్డి క్యాబినెట్ విస్తరణను అడ్డుకుంటున్నారని తెలిపారు. వాకిటి శ్రీహరి, బీర్ల అయిలయ్య, ఆదిశ్రీనివాస్, తదితర బీసీ ఎమ్మెల్యేలను ఎగదోస్తున్నాడనీ, మరోవైపు తమ సామాజిక తరగతుల వారికి మంత్రి పదవి ఇవ్వాలని లంబాడీ, మాదిగ సామాజిక తరగతులకు చెందిన ఎమ్మెల్యేలతో ప్రత్యేక సమావేశాలు పెట్టిస్తున్నారని ఆరోపించారు.

మంత్రి పదవి విషయంలో పెద్దపల్లి జిల్లాలో ఇద్దరు సీనియర్ ఎమ్మెల్యేల మధ్య తగువు పెట్టారని ఎత్తిచూపారు. రంగారెడ్డి జిల్లాకు చెందిన వారికి మంత్రి పదవి ఇవ్వాలని జానారెడ్డితో అధిష్టానానికి రేవంత్‌రెడ్డి లేఖ రాయించారని చెప్పారు. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, వివేక్‌కు మంత్రి పదవులు గ్యారెంటీ అని చెబుతూనే సుదర్శన్‌రెడ్డిని ఎగదోస్తున్నారని, సామాజిక పొందిక పేరుతో జగన్నాటకం ఆడుతున్నారని వివరించారు. బీసీలైన పొన్నం ప్రభాకర్, కొండా సురేఖలకు పనికిరాని శాఖలు ఇచ్చారనీ, సీఎం కీలకమైన శాఖలను తన దగ్గరే ఉంచుకున్నారని విమర్శించారు. మంత్రి వర్గ విస్తరణ జరిగితే దామోదరరాజనర్సింహ్మా, పొన్నం ప్రభాకర్‌లతో పాటు కొత్త మంత్రులకు తన దగ్గర ఉన్న మున్సిపల్, హోం, విద్యా, తదితర కీలక శాఖలను వారికి అప్పగించాలనే భయం కూడా రేవంత్‌రెడ్డిని వెన్నాడుతోందన్నారు.

డిజిటల్ లావాదేవీలలో 'మీ టికెట్ యాప్' జోష్

- 50 వేలకు పైగా డౌన్‌లోడ్లు

ప్రజాశక్తి - హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వ ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ (ఇఎస్‌డి) విభాగం అభివృద్ధి చేసిన 'మీ టికెట్' మొబైల్ యాప్ రాష్ట్రంలో డిజిటల్ టికెటింగ్‌లో విప్లవాత్మక మార్పులు తెస్తోంది. 50 వేలకుపైగా డౌన్‌లోడ్‌లు, రూ.1 కోటికిపైగా లావాదేవీలు, 83,000కి పైగా టికెట్‌ల బుకింగ్‌తో ఈ యాప్ ప్రజాదరణ పొందింది.

హైదరాబాద్ మెట్రో, ఉద్యానవనాలు, జూ పార్కులు, దేవాలయాలు, సామాజిక సేవలకు నగదు రహిత, సౌకర్యవంతమైన టికెటింగ్ సేవలను అందిస్తోంది. రాష్ట్ర వ్యాప్త విస్తరణకు సిద్ధమవుతున్న ఈ యాప్ త్వరలో తెలంగాణ టూరిజం ప్యాకేజీలు, టిజిఆర్‌టిసి బస్‌పాస్ ఇంటిగ్రేషన్‌ను పరిచయం చేయనుంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద సరస్వతి పుష్కరాల్లో వేలాది భక్తులు టికెటింగ్, సేవా నిర్వహణ కోసం ఈ యాప్‌ను వినియోగిస్తున్నారు.

త్వరలో మీ టికెట్ యాప్‌లో తెలంగాణ టూరిజం ప్యాకేజీలు అందుబాటులోకి రానున్నాయి. కాళేశ్వరం, బాసర, యాదాద్రి వంటి ఆధ్యాత్మిక క్షేత్రాలు, బొగత జలపాతం, లక్నవరం సరస్సు, కొండపోచమ్మ సాగర్ వంటి పర్యావరణ పర్యాటక ప్రదేశాలు, వరంగల్ కోట, రామప్ప ఆలయం, భోంగిర్ కోట వంటి చారిత్రక స్థలాలకు గైడెడ్ టూర్‌లు ఈ ప్యాకేజీల్లో ఉంటాయి. టికెటింగ్, స్థానిక రవాణా, వసతి బుకింగ్‌లను ఒకే యాప్‌లో అందించనున్నారు. అంతేకాక, టీజీఆర్టీసీ బస్ పాస్ ఇంటిగ్రేషన్‌తో నెలవారీ, సీజనల్ బస్ పాస్‌లను డిజిటల్‌గా నిర్వహించే సౌలభ్యం, స్మార్ట్ క్యూఆర్ కోడ్‌లు, రీన్యూవల్ రిమైండర్‌లు కూడా అందుబాటులోకి రానున్నాయి.

అహంకారానికి ఐడి కార్డు కెటిఆర్

- ఫిషర్మెన్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుసాయి కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి కెటిఆర్ అహంకారానికి ఐడి కార్డు... దురహంకారానికి అధార్ కార్డు అలాంటి వారని ఫిషర్మెన్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఎద్దేవా చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. అందాల పోటీల్లో పాల్గొంటున్న మహిళలు రామప్ప గుడి వద్ద తమ కాళ్లు తామే కడుక్కుంటున్న వీడియోలను ఆయన తప్పుగా ప్రచారం చేశారని విమర్శించారు. ఆ విషయంపై కెటిఆర్ ఎక్స్‌లో అబద్ధపు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ నాయకులు తమ స్థితి, గతి, మతి కోల్పోయి మాట్లాడుతున్నారని విమర్శించారు. కెటిఆర్ మతి పోయిందా? ఆయన దగ్గర పని చేస్తున్న సిబ్బంది మతిపోయిందా? అని ప్రశ్నించారు. ఈ క్రమంలో కెటిఆర్ ఎర్రగడ్డలో చికిత్స చేయించుకునేందుకు తగిన సాయం చేస్తామని ఎద్దేవా చేశారు. రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయిలో నిలబెట్టాలంటూ సిఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. సిఎంకు ఎక్కడ మైలేజ్ వస్తుందోనన్న అక్కసుతో ఆయన ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. తన పిల్ల చేష్టలు, చిల్లర పోస్టులతో తెలంగాణ ఆడపడుచులను కెటిఆర్ ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు.